కవితా కౌముది

# హృదయం

సురేందర్ కోమటిరెడ్డి

అందాన్ని చూసిన మరు క్షణం
విభ్రాంతితో, వికసించి, విప్పార్చుకుని
కనురెప్ప మరచి, తనను తాను మరచి
సొగసంతా ఆ క్షణమే జుర్రుకుని
తనివి తీరా దూరం నుండే తడుమేసుకుని
ఆ కొద్ది క్షణాల అందాల విందుని
ఆస్వాదించి
అందం దూరం వెళ్ళగానే
ఆ దృశ్యాన్ని నెమ్మదిగా మెదడు పొరల్లోకి తోసి
కనులు తెరచి ముందుకు సాగి పోతుంది

దగ్గరికి వచ్చిన అద్భుత దృశ్యాన్ని
మస్తిష్కం, ఒకసారి తడిమి చూసుకుని
ఆ నేత్రాలు అంత తాద్యత్మత కి
ఎందుకు గురయ్యాయో గుర్తెరిగి
ముద్దాడుదాము అంటే ముద్దాడలేక
హత్తుకుందామంటే హత్తుకోలేక
నిస్సహాయతలో
ఆ దృశ్యాన్ని భద్రంగా
తన జ్ఞాపకాల గదిలో నిక్షిప్తం చేసి
మరు క్షణం బాహ్య ప్రపంచం లో
మమేకం అయిపోతుంది



కాని హృదయం అలా కాదు
చూసిన కళ్ళు మరచి పోయినా
జ్ఞాపకాల్లో పదిల పరిచి ముందుకు సాగినా
హృదయానికి నచ్చితే మాత్రం
ఆ అందం చుట్టూనే
ఆ దృశ్యం చుట్టూనే
ఆ క్షణం చుట్టూనే
తిరుగుతూనే ఉంటుంది,
తల్లడిల్లి పోతూ ఉంటుంది!
దూరం వెళ్ళిన ఆ దృశ్యం
మళ్ళీ రాదేమోనని
పుట్టెడు దుఖ్ఖంలో
కుమిలి పోతూనే ఉంటుంది
ఎవరో తనని మెలిపెడుతున్నట్లు
లోలోపల గునపాలు గుచ్చుకుంటున్నట్లు
నిత్యం అల్లకల్లోలం
అవుతూనే ఉంటుంది!

అసలు దేవుడు హృదయాన్ని ఇవ్వకపోయి ఉంటే
ఈ అందాలకి విలువే ఉండేది కాదు,
అందులోను..మగ జాతికి కొన్నిసార్లు
మరింత సున్నితమైన
హృదయాన్నిచ్చి
అందాలకు అలవికాని ఆనందం ఇచ్చాడు!
ఎంతైన..ఆ దేవుడు కూడా ఒక మగాడే కదా!!

★★★

# పరమార్థం

శెట్టిపల్లి అరుణా ప్రభాకర్

శిలనై ఉలి దెబ్బలైనా తింటాను గానీ
పంటికింద రాయిని మాత్రం కాను,
మెరుపునై క్షణమైనా మెరిసిపోతాను కానీ
దావాగ్నినై కానలు కాల్చను,
బిందువై ముత్యపు చిప్పలో చేరుతాను కానీ
వరదనై పల్లెలు ముంచెత్తను,
మట్టినై మొక్క మొలిపిస్తా కానీ
మణినై ఏ రాజ కిరీటంలోనో కూర్చొను,
స్వేదమై శ్రామికుని నుదుట చిందుతా కానీ
పరిమళమై భవంతుల్లో తిరుగాడను,
పల్లె పాటనై జనుల నోట పలుకుతా గానీ
కావ్యమై గ్రంథాల్లో బందీ కాను,
ఆర్తుల కంటి కన్నీటి బొట్టై రాలిపోతా గానీ
ధూర్తుల చేతి బంగారు పాత్రలో మధువునై
మురిసిపోను,
ఎండు కర్రనై పేదవాని పొయ్యిలో కాలుతా గానీ
గొడ్డలినై వృక్షాన్ని కూల్చను,
బ్రతికేది క్షణమైనా
దాని అర్థమే నాకు పరమార్థం.

★★★

# దృక్పథం

క్రాంతికుమార్ మలినేని

నీరెండిపోయి
చెరువుండిపోయినా
చెరువెండిపోయిందంటాం

వేరు చచ్చి పోయి
చెట్టుండి పోయినా
చెట్టు చచ్చిందంటాం

ప్రాణం పోయి
మనిషి ఉండిపోయినా
శవమంటాం

జీవంలేని దాన్ని
గుర్తించకపోవడమే మన గుణం.

జీవంలేని డబ్బుని
నెత్తిన పెట్టుకోవడంలో మాత్రమే
మన సుగుణాన్ని మరిచాం.

★★★



# రసరేఖలు శ్రీధర్ బచ్చోటి

వలయునానందమిలలోని వారికెల్ల
శాంతి సుఖమును సంతృప్తి సంతసమ్ము
కలతల జయించి బ్రతుకును గడపవలయు
మనసు నిండగవలయు సమ్మదము తోడ

ప్రమదమయము జీవితమున ప్రతిదినమ్ము
కలవు ప్రతిచోటనానందకారణములు
చింత మరచుట సులభమ్ము సృష్టి యందు
హేతువులు గలవెన్నొ సంతృప్తి చెంద

వనధి తరగల జూడ నంబరము జూడ
గగనసీమ సాగెడు విహగముల జూడ
పూలపాపల చిరునగవులను జూడ
స్వాంతముప్పొంగునానందవార్ధి మున్గు

దినములన్నియు గడచు సంతృప్తితోడ
ఎచట ముదమున్నదో గ్రహియించినపుడు
పరులకానందలేశముల్ పంచినపుడు
అరయ పరితోషమును హృదయాంతరమున

మోదమునకెల్ల హృదయమే మూలమంచు
వగపులన్నింటి మూలము బాహ్యమంచు
విదితమైనంత వికసించు హృదయసుమము
అద్భుతానందముదయించునాత్మయందు

COMMENTS